# అక్షరశక్తి

The Power of Pen

Evening Daily

సంపుటి: 20 | సంచిక: 306 | వరంగల్ | గురువారం, 10 సెప్టెంబర్ 2026 | పేజీలు: 06




తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన అసెంబ్లీ కమిటీ హాల్లో జరిగిన కాంగ్రెస్ శాసనసభా పక్ష సమావేశం ముగిసింది. ఈ సమావేశంలో అసెంబ్లీలో అనుసరించాల్సిన వ్యూహం, ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టడం వంటి అంశాలపై చర్చించారు. అలాగే ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే కార్యాచరణపైనా చర్చలు జరిగాయి. - అక్షరశక్తి, హైదరాబాద్

# ప్రజల్లోకి వెళ్లండి!

## బీఆర్ఎస్ కుట్రను తిప్పికొట్టండి..

ఎమ్మెల్యేల పనితీరే రాజకీయ భవిష్యత్తుకు కొలమానం



- అసెంబ్లీకి పూర్తి స్థాయిలో హాజరు కావాలి
- ప్రజా సమస్యలను సభలో బలంగా వినిపించాలి
- కులగణనపై తెలంగాణ మోడల్‌ను దేశవ్యాప్తంగా చాటాలి
- ఓటు హక్కు పరిరక్షణపై అప్రమత్తంగా ఉండాలి
- సీఎల్పీ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి

5

# విద్యారంగాన్ని గాలికి వదిలేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- పాలిటెక్నిక్ విద్యకు శాపంగా మారిన జీవో నెంబర్ 97 వెంటనే రద్దు చేయాలి.
- వరంగల్ పశ్చిమ మాజీ ఎమ్మెల్యే ద్యాసం భాస్కర్




5



# వీరనారి చాకలి ఐలమ్మకు ఘన నివాళి

- ఐలమ్మ పోరాట స్ఫూర్తి భావితరాలకు ఆదర్శం
- మహిళా సాధికారతకు ప్రభుత్వం కృషి
- కుడా ఛైర్‌పర్సన్ గుండు సుధారాణి

2



## భావితరాలకు స్ఫూర్తిదాయకం వీరనారి చాకలి ఐలమ్మ



**అక్షరశక్తి, వరంగల్:** వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి భావితరాలకు ఆదర్శంగా నిలుస్తుందని కుడా ఛైర్‌పర్సన్ గుండు సుధారాణి అన్నారు. చాకలి ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకొని గురువారం న్యూ శాయంపేట జంక్షన్‌లోని ఆమె విగ్రహానికి కుడా ఛైర్‌పర్సన్ గుండు సుధారాణి, వరంగల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాశ్, కలెక్టర్లు డాక్టర్ సత్య శారద, చాహత్ బాజ్‌పాయి, అధికారులు, ప్రజా సంఘాల ప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గుండు సుధారాణి మాట్లాడుతూ చాకలి ఐలమ్మ కేవలం ఒక వర్గం కోసం కాకుండా రైతులు, పేదలు, అణగారిన వర్గాల హక్కుల కోసం ధైర్యంగా పోరాడిన వీరవనితగా చరిత్రలో నిలిచిపోయారని అన్నారు. ప్రతికూల పరిస్థితుల్లోనూ అన్యాయానికి వ్యతిరేకంగా ఆమె సాగించిన పోరాటం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఐలమ్మ పోరాటం మహిళా సాధికారత, ఆత్మగౌరవం, సామాజిక న్యాయానికి ప్రతీకగా నిలిచిందన్నారు. ఆమె ధైర్యం, తెగువ, ఆత్మవిశ్వాసాన్ని నేటి తరం స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారత, సామాజిక న్యాయం, సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందని సుధారాణి తెలిపారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వై.వి. గణేష్, ఎల్. కిషోర్ కుమార్, ఎన్. రవి, ఆర్డీవో సుమ, కుడా సీపీఓ అజిత్ రెడ్డి, తహసీల్దార్ రవీందర్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ అధికారులు పుష్పలత, లక్ష్మణ్, మత్స్య శాఖ అధికారి శ్రీపతి, డాక్టర్ మధుచందర్, తోట వెంకన్న, చీకటి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య పరిరక్షణకు రక్త పరీక్షలు ఎంతో అవసరం



**అక్షరశక్తి,హనుమకొండ:** సాయిబాబా మందిరంలో గురువారం భక్తులు, అవసరార్థుల ఆరోగ్య పరిరక్షణను దృష్టిలో ఉంచుకొని ఉచిత రక్త పరీక్షల కార్యక్రమం నిర్వహించారు. మందిర చైర్మన్ మతుకుమల్లి హరగోపాల్ కార్యక్రమాన్ని ప్రారంభించి, ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవడంతో పాటు వ్యాధులను ముందస్తుగా గుర్తించేందుకు రక్త పరీక్షలు ఎంతో అవసరమని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూ క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. మందిర ధర్మకర్త, పీఆర్వో నిమ్మల శ్రీనివాస్ స్వయంగా రక్త పరీక్షలు చేయించుకొని మాట్లాడుతూ, సాయినాథుని సేవా స్ఫూర్తితో ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు ఉచిత ఆరోగ్య, వైద్య సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంచడం, అవసరమైన వారికి ఉచిత వైద్య సేవలు అందించడం మందిర సేవా కార్యక్రమాల్లో భాగమని పేర్కొన్నారు. టెక్నీషియన్లు సురేందర్, శృతి రక్త పరీక్షలు నిర్వహించగా, మందిర సిబ్బంది రాజు, సాయి కృష్ణ తదితరులు సహకరించారు. భక్తులు, అవసరార్థులు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకున్నారు.

# ఎన్ఐటీ వరంగల్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధికి 'ఫేస్ ఆఫ్ ఇండియా 2026'



**అక్షరశక్తి, వరంగల్:** ఎన్ఐటీ వరంగల్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధికి ప్రతిష్ఠాత్మక 'ఇండియాస్పార్క్ ఫేస్ ఆఫ్ ఇండియా 2026' గుర్తింపు లభించింది. ఇండియాస్పార్క్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'అకడమిక్ విజనరీస్ ఆఫ్ ఇండియా' సిరీస్‌లో భాగంగా ఆయనను ఈ గౌరవానికి ఎంపిక చేశారు. ఇంజినీరింగ్ విద్య, పరిశోధన, ఆవిష్కరణలు, సంస్థాగత నాయకత్వ రంగాల్లో ఆయన అందిస్తున్న విశిష్ట సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారం దక్కింది. మూడు దశాబ్దాలకు పైగా విద్యా, పరిశోధనా రంగాల్లో అనుభవం ఉన్న ప్రొఫెసర్ సుబుధి, స్మార్ట్ గ్రిడ్లు, పునరుత్పాదక ఇంధనం, ఎలక్ట్రిక్ వాహన సాంకేతికత వంటి ఆధునిక రంగాల్లో విశేష పరిశోధనలు చేస్తున్నారు. ఆయన 300కు పైగా పరిశోధనా పత్రాలను ప్రచురించడంతో పాటు ఆరు పుస్తకాలను రచించారు. ఐదు పేటెంట్లు ఆయన పేరిట ఉన్నాయి. 46 మందికి పైగా పీహెచ్‌డీ విద్యార్థులకు మార్గదర్శకత్వం అందించారు. ప్రతిష్ఠాత్మక జె.సి. బోస్ ఫెలోషిప్పు అందుకున్న ప్రొఫెసర్ సుబుధి, ఇండియన్ నేషనల్ అకాడమీ ఆఫ్ ఇంజినీరింగ్ (INAE), ఇన్స్టిట్యూషన్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (IET), యూకే సంస్థల Fellowగా ఉన్నారు. 2023 నుంచి ఎన్ఐటీ వరంగల్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న ప్రొఫెసర్ సుబుధి, సంస్థలో పరిశోధన, ఆవిష్కరణలు, డిజిటల్ గవర్నెన్స్‌ను మరింత బలోపేతం చేయడంపై దృష్టి సారించారు. విద్యా, పరిశోధనా వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు ఆవిష్కరణలకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించేందుకు పలు చర్యలు చేపట్టారు.యువ పరిశోధకులకు మార్గదర్శకత్వం అందించడంతో పాటు అంతర్జాతీయ స్థాయిలోనూ ఆయన విస్తృతమైన విద్యా, పరిశోధనా సహకారాలను కొనసాగించారు. ఈ సందర్భంగా ఇండియాస్పార్క్ వ్యవస్థాపకురాలు, సీఈఓ శ్రీమతి రూపా తంతి మాట్లాడుతూ, "ప్రొఫెసర్ సుబుధిని సత్కరించడం మాకు గర్వకారణం. ఎన్ఐటీ వరంగల్‌లో ఆయన అందిస్తున్న పరివర్తనాత్మక నాయకత్వం, సుస్థిర ఇంధన రంగంలో చేస్తున్న మార్గదర్శక పరిశోధనలు భారత ఆవిష్కరణ స్ఫూర్తిని ప్రతిబింబిస్తున్నాయి" అని అన్నారు.

# కిట్స్ వరంగల్–సెంట్రల్ ఇండియా మధ్య ఎంవోయూ



**అక్షరశక్తి, హసన్‌పర్తి :** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆవిష్కరణ, అనుభవపూర్వక అభ్యాసం, విద్యార్థుల అభివృద్ధిని ప్రోత్సహించేలా కిట్స్ వరంగల్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (ఏఐ, ఎంఎల్) విభాగం, హైదరాబాద్‌కు చెందిన స్టార్టప్ సంస్థ సెంట్రల్ ఇండియా మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. కిట్స్ డబ్ల్యూ కమిటీ హాల్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఒప్పంద పత్రాలను పరస్పరం మార్చుకున్నారు. విద్యార్థులకు పరిశ్రమకు అవసరమైన నైపుణ్యాలు అందించడం, ఏఐ ఆధారిత ఫ్రేమ్‌వర్క్‌ను అభివృద్ధి చేయడం, ఆవిష్కరణలు, వ్యవస్థాపకతను ప్రోత్సహించడం లక్ష్యమని కిట్స్ అదనపు కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే వి. సతీష్ కుమార్ తెలిపారు. కిట్స్ వరంగల్ చైర్మన్, మాజీ రాజ్యసభ సభ్యుడు కెప్టెన్ వి. లక్ష్మీకాంతరావు, కోశాధికారి పి. నారాయణరెడ్డి, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోక్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. సెంట్రల్ ఇండియా సహ వ్యవస్థాపకుడు జి. సాయి కృష్ణ మాట్లాడుతూ ప్రాక్టికల్ లెర్నింగ్, మెంటరింగ్, పరిశ్రమ ఆధారిత అనుభవాల ద్వారా విద్యార్థులకు అభివృద్ధి చెందుతున్న సాంకేతికతపై అవగాహన కల్పిస్తామన్నారు. ఐఐఎం రాంచీ పూర్వ విద్యార్థి గుగులోత్తు వంశీ, ఐఐటీ కోల్‌కతా పూర్వ విద్యార్థి గుగులోత్తు సాయి కలిసి సంస్థను స్థాపించారని తెలిపారు. అక్టోబర్ 10, 11 తేదీల్లో వరంగల్, హనుమకొండ, కాజీపేటకు చెందిన వెయ్యి మందికి పైగా విద్యార్థులతో ట్రైసిటీ ఏఐ హ్యాకథాన్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అశోక్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం. కోమల్‌రెడ్డి, ఏఐ-ఎంఎల్ విభాగాధిపతి డాక్టర్ ఎ. జ్యోతి ప్రభ, ఇంటర్న్‌షిప్‌ల ఇన్‌చార్జి ప్రొఫెసర్ డాక్టర్ ఎం. వీరారెడ్డి, కెమిస్ట్రీ అసోసియేట్ ప్రొఫెసర్, పీఆర్వో డాక్టర్ డి. ప్రభాకరాచారి, డాక్టర్ జి. సునీల్‌కుమార్, డాక్టర్ వినయ్‌కుమార్, డాక్టర్ బి. హనుమంతు, డాక్టర్ ఎం. రాజేష్, డీన్లు, హెచ్‌వోడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# మేడపల్లి పీహెచ్‌సీలో డీఎంహెచ్ఓ తనిఖీ



అక్షరశక్తి, వరంగల్: మేడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రాజా రెడ్డి గురువారం తనిఖీ చేశారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించిన ఆయన.. వైద్యాధికారి డాక్టర్ బి. జ్యోతి, సిబ్బందితో మాట్లాడి రికార్డులు, రిపోర్టులను పరిశీలించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల్లో నిర్దేశించిన లక్ష్యాలను సాధించేలా పనితీరును మెరుగుపరచాలని సూచించారు. టీకాల నిల్వ కేంద్రంలోని ఐఎల్ఆర్, డీప్ ఫ్రిజర్‌లను పరిశీలించి కోల్డ్‌చైన్ వ్యవస్థను తనిఖీ చేశారు. ఫార్మసీ, మందుల లభ్యత, వార్డులను పరిశీలించి ఇన్‌పేషెంట్లతో మాట్లాడి వైద్య సేవలపై అభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం హెడ్‌క్వార్టర్, ఫీల్డ్ సిబ్బంది, ఆశా కార్యకర్తలతో సమీక్ష నిర్వహించి క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టి ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు.

అక్షరశక్తి
Evening Daily
3
గురువారం, 10 సెప్టెంబర్ 2026
Telugu Trending News

# నిజాం రాచరికాన్ని ఓడించిన చరిత్ర కమ్యూనిస్టులదే

**అక్షరశక్తి, హనుమకొండ:** నిజాం రాచరికాన్ని ఓడించిన చరిత్ర కమ్యూనిస్టులదేనని, తెలంగాణ యోధుల చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని సీపీఐ హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి అన్నారు. గుండ్లసింగారంలోని సురవరం సుధాకర్‌రెడ్డి నగర్‌లో సీపీఐ శాఖ ముఖ్య కార్యకర్తల సమావేశం మండల సహాయ కార్యదర్శి గుంటి రాజేందర్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన తోట బిక్షపతి మాట్లాడుతూ భూస్వామ్య వ్యవస్థ, వెట్టిచాకిరి, బానిసత్వానికి వ్యతిరేకంగా కమ్యూనిస్టులు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి పిలుపునిచ్చారని తెలిపారు. పోరాటంలో 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచి, 3 వేల గ్రామాలను విముక్తి చేశారని, 4,500 మంది కమ్యూనిస్టులు ప్రాణత్యాగం చేశారని పేర్కొన్నారు.

సెప్టెంబర్ 11 నుంచి 17 వరకు జిల్లా వ్యాప్తంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 11న సీపీఐ జిల్లా కార్యాలయం నుంచి ఏకశిల పార్క్‌లోని టాను నాయక్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి సభ చేపట్టనున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు హాజరవుతారని తెలిపారు. సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి ఎన్.ఎ. స్టాలిన్, మండల సహాయ కార్యదర్శి గుంటీ రాజేందర్, పూజారి అమృతయ్య, మామునూరి దామోదర్, కేతపాక ప్రసాద్, గుంటీ రజిత, కాలనీ వాసులు పాల్గొన్నారు.




# విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు కల్పించాలి

**జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు**





**అక్షరశక్తి,ములుగు:** విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు పాఠశాలలో మెరుగైన వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు. గురువారం ములుగు మండలం బండారుపల్లిలోని తెలంగాణ గురుకుల పాఠశాల (బాలుర), జూనియర్ కళాశాల ను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని తరగతి గదులు, వంటశాల, భోజనశాల, వసతిగృహం, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థుల హాజరు, బోధన, భోజన పట్టిక, సరుకుల నిల్వలకు సంబంధించిన నమోదులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థుల ఆరోగ్యం, విద్య, భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని, వంటశాల, భోజనశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన మౌలిక వసతులను అందుబాటులో ఉంచాలని తెలిపారు. అనంతరం తరగతి గదులను సందర్శించిన కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడారు. పాఠ్యాంశాల బోధన, భోజనం, వసతిగృహ సౌకర్యాలు, తాగునీరు, మరుగుదొడ్ల నిర్వహణ తదితర వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని సూచించారు. ఉపాధ్యాయులు విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను నిరంతరం పరిశీలిస్తూ, చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు విద్యార్థులకు సురక్షితమైన వాతావరణం కల్పించాలని సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా విద్యాశాఖ అధికారి సిద్ధార్థ రెడ్డి ఉన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఐలమ్మ స్ఫూర్తితో బీసీ రాజ్యాధికారం కోసం పోరాడాలి

**అక్షరశక్తి, వరంగల్:** చిట్యాల ఐలమ్మ పోరాట స్ఫూర్తితో బీసీలు రాజ్యాధికారం కోసం పోరాడాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటి పాముల వెంకట్రాములు పిలుపునిచ్చారు. ఐలమ్మ వర్ధంతి సందర్భంగా వరంగల్ పోచమ్మ మైదాన్ సెంటర్‌లో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకట్రాములు మాట్లాడుతూ భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా, వెట్టిచాకిరి, బానిసత్వానికి వ్యతిరేకంగా ఐలమ్మ సాగించిన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. రైతులు, కూలీలు, ఎస్సీ, ఎస్టీ, బీసీలు అణచివేతకు గురైన కాలంలో ఆమె భూమి, భుక్తి కోసం పోరాడారని తెలిపారు. భూస్వామ్య, పెట్టుబడిదారీ దోపిడీ వ్యవస్థ కొనసాగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, బడుగు బలహీన వర్గాల ప్రజలు ఐక్యమై సామాజిక అసమానతలు లేని సమసమాజ నిర్మాణం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీసీ హక్కుల సాధన సమితి మండల అధ్యక్షుడు పరికరాల రమేష్, కార్యదర్శి కట్కోజు చంద్రశేఖర్, సీపీఐ మండల కార్యదర్శి గుండె బద్రి, సయ్యద్ హఫీజ్, తాళ్లపెల్లి రహేలా, రషీద్, దసురు, షబానా, జన్ను శారద తదితరులు పాల్గొన్నారు.



# బాల్య వివాహాలను అరికట్టాలి



**అక్షరశక్తి, నర్సంపేట:** బాల్య వివాహాలను నిరోధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మి రామానంద్ పిలుపునిచ్చారు. నర్సంపేట మున్సిపాలిటీలో స్వయంకృషి సోషల్ వర్క్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఎఫ్ఎంఎం సోషల్ సర్వీస్ సొసైటీ సహకారంతో రూపొందించిన గోడపత్రికలను చైర్‌పర్సన్, మున్సిపల్ కమిషనర్ కాటం భాస్కర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ నర్సంపేటను బాల్య వివాహ రహిత ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దేందుకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలన్నారు. వివాహాలను తప్పనిసరిగా నమోదు చేయించుకోవడం ద్వారా బాల్య వివాహాలను అరికట్టవచ్చని కమిషనర్ కాటం భాస్కర్ తెలిపారు. స్వయంకృషి సంస్థ నిర్వాహకులు బెజ్జంకి ప్రభాకర్ మాట్లాడుతూ 18 ఏళ్లలోపు బాలికలకు, 21 ఏళ్లలోపు బాలురకు వివాహం చేయడం నేరమని, బాల్య వివాహ నిరోధక చట్టం 2006 ప్రకారం శిక్షలు ఉంటాయని తెలిపారు. బాల్య వివాహ ప్రయత్నం కనిపిస్తే 1098 చైల్డ్ హెల్ప్‌లైన్, 100 పోలీస్ నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కస్తూర్బా మహిళా మండలి అధ్యక్షురాలు గుర్రం అరుణ, మహిళా సభ్యులు కొయ్యడి సరళ, వేములపల్లి ఉమాదేవి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# మట్టి వినాయకుడి ప్రతిమలపై అవగాహన

**అక్షరశక్తి, హసన్‌పర్తి:** మట్టి వినాయక విగ్రహాల ఆవశ్యకతపై 66వ డివిజన్ కేంద్రంలోని సుజాత విద్యానికేతన్ ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాలలో గురువారం వెయ్యి కరపత్రాలను ఆవిష్కరించారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఆకుతోట శాంతారాం కర్ణ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వల్ల చెరువులు కలుషితమై జలచరాలు, పశుపక్షాదులకు నష్టం కలుగుతోందని ప్రిన్సిపాల్ తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా గత 30 ఏళ్లుగా మట్టి వినాయక విగ్రహాల తయారీ, పంపిణీ చేపడుతున్నామని, ఏటా 1,500 విగ్రహాలను విద్యార్థులతో తయారు చేయించి ఉచితంగా పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమానికి జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఆరుసార్లు పర్యావరణ మిత్ర అవార్డులు లభించాయని తెలిపారు. ఇకపై కూడా పర్యావరణహిత కార్యక్రమాలను కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ గూడూరు లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.





## న్యూ శాయంపేటలో వైభవంగా పోచమ్మ బోనాలు

**అక్షరశక్తి, హనుమకొండ:** నగరంలోని న్యూ శాయంపేట 31వ డివిజన్‌లో గురువారం పోచమ్మ బోనాల ఉత్సవాలు వైభవంగా జరిగాయి. డివిజన్ మాజీ కార్పొరేటర్ మామిండ్ల రాజు యాదవ్, వేల్పుల మోహన్‌రావు ఆహ్వానం మేరకు హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీక అన్నారు. జిల్లా ప్రజలకు బోనాల శుభాకాంక్షలు తెలిపారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీసీసీ మాస్టర్ ట్రైనింగ్ కమిటీ సభ్యుడు మారంరెడ్డి కౌటిల్‌రెడ్డి, వేల్పుల రోహిత్, స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ జీవితం స్ఫూర్తిదాయకం



**అక్షరశక్తి, పరకాల:** తెలంగాణ సాయుధ పోరాట వీరనారి చాకలి ఐలమ్మ జీవితం స్ఫూర్తిదాయకమని టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర వైస్ చైర్మన్ డాక్టర్ మడికొండ శ్రీను అన్నారు. పరకాల పట్టణంలోని అమరధామంలో స్థానిక రజక సంఘం ఆధ్వర్యంలో ఐలమ్మ వర్ధంతిని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ మడికొండ శ్రీను ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా, వెట్టిచాకిరి నిర్మూలన కోసం, భూమి, భుక్తి కోసం ఆమె సాగించిన పోరాటం చిరస్మరణీయమన్నారు. ఐలమ్మ ఆశయాల సాధనకు నేటి యువత కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు నేరెళ్ల పరశురామ్, నడిగొట్టి శంకర్, మీడిదొడ్డి నరేష్, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి మంద నాగరాజు, మలక్పేట మాజీ సర్పంచ్ అల్లం రఘునారాయణ, బొచ్చు రవి, మంద వెంకటేష్, బొజ్జం సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఏసీబీకి పట్టుబడిన ఉద్యోగులు



**అక్షరశక్తి, హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలో ఇద్దరు ఉద్యోగులు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు. సెక్రటేరియట్‌లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగి ఆనందేసి రాఘవేందర్, పరిశ్రమ భవన్‌లో సీనియర్ అసిస్టెంట్ మేడి వినోద్ రూ.లక్ష లంచం తీసుకుంటూ ఏసీబీకి రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కారు. సీఎంఆర్‌ఎఫ్ కింద మంజూరైన రూ.2 లక్షల మెడికల్ రీయింబర్స్‌మెంట్స్ చెక్ కోసం సదరు ఉద్యోగులను సంప్రదించగా అందుకు ఇద్దరు లంచం డిమాండ్ చేశారు. మొదటి విడతగా రాఘవేందర్ రూ.5 వేలు తీసుకోగా మలి విడతగా సీనియర్ అసిస్టెంట్ మేడి వినోద్ రూ.లక్షా తీసుకుంటూ పట్టుబడ్డాడు. ఇద్దరిపై కేసు నమోదు చేసి నాంపల్లి జుడిషియల్ కోర్టులో హాజరుపరిచామని ఏసీబీ అధికారులు వివరించారు.

# త్యాగాలతో సాధించుకున్న హక్కులను కాపాడుకోవాలి

- సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర నేత చిన్న చంద్రన్న



**అక్షరశక్తి, కొత్తగూడ:** ప్రజలపై దోపిడీ పీడన ఉన్నంతకాలం మార్క్సిజం ఉంటుందని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పాయం చిన్న చంద్రన్న అన్నారు. గంగారం కొత్తగూడ మండలాల ముఖ్య కార్యకర్తలకు జనరల్ బాడీ పందెం గ్రామంలో నిర్వహించారు. ఈక బిక్షం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన చంద్రన్న మాట్లాడుతూ వెనకబడిన ఏజెన్సీ ప్రాంతాలలో ఆదివాసి, గిరిజన ఇతర పేద ప్రజలకు అండగా నిలబడి భూమిని సంపాదించి పెట్టడంలో విప్లవకార్ల కృషి త్యాగం గొప్పదన్నారు. పాలకవర్గ పార్టీల భ్రమలలో కొందరు కమ్యూనిస్ట్ విప్లవ పార్టీల పని ఐపోయిందనే తప్పుడు ప్రచారం తగదన్నారు. ప్రజల ఐక్యంగా త్యాగాలతో పోరాడి సాధించుకున్న హక్కులను చైతన్యవంతంగా కాపాడుకోవాలని అన్నారు. పాసిస్ట్ తరహా పరిపాలన సాగిస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలపై ఐక్య పోరాటాలు చేయాలన్నారు. సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రవి మాట్లాడుతున్న 421 హామీలకు ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం వాటి అమలులో విఫలం లేదని అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పరస్పర విమర్శలు దాడులతో ప్రజా సమస్యలు గాలికొదిలి కాలయాపన చేస్తున్నారని అన్నారు. ప్రజా పోరాటాలే పాలకవర్గాలకు నిజమైన ప్రత్యామ్నాయంగా నిలవాలని పిలుపునిచ్చారు. సిపిఐ మాస్ లైన్ మహబూబాబాద్ డివిజన్ కార్యదర్శి పూనెం ప్రభాకర్ మాట్లాడుతూ గంగారం కొత్తగూడ మండలాలలో ఎండుతున్న పంటలను అధికారులు వెంటనే సర్వే చేయాలని కోరారు. ఇంకా ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గొంది సమ్మయ్య కురుసం రంగయ్య జోగరామయ్య పూనం రవికుమార్ చిత్తారి పాపయ్య వాసం పాపయ్య కురుసం సురేష్ నాగేశ్వరరావు బుచ్చి రాములు నారాయణ రెడ్డి వసంతరావు కల్తీ ఎర్రక్క సతీష్ సురేష్ వీరస్వామి తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఎండిన పంటలను అధికారులు సర్వేలు చేయాలని, ప్రతి ఎకరాకు 30000 పంట నష్టపరిహారం ఇవ్వాలని, పెరిగిన ఎరువుల ధరలు తగ్గించాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలు చేయాలని పలు సమస్యలపై జనరల్ బాడీ జనరల్ బాడీ తీర్మానాలను ఆమోదించింది.

# చావు కాదు రేవు చేరుకో...

- ఆత్మహత్యల నివారణ సామాజిక బాధ్యత
- ఆత్మహత్యల నివారణ కమిటీ చైర్మన్ డాక్టర్ పరికిపండ్ల అశోక్




**అక్షరశక్తి, వరంగల్ :** జీవితం జీవించడానికే, ఆత్మహత్యలకు పాల్పడవద్దని, కష్టాలు ఎదురైనప్పుడు ధైర్యంతో ఎదుర్కొని ముందుకు సాగాలని, వైఫల్యాలను వెక్కిరించి అఘాయిత్యాల ఆలోచనను మానుకొని ఆత్మస్థైర్యంతో ముందుకు సాగిన మనిషి పరిపూర్ణుడు అవుతాడని ఆత్మహత్యల నివారణ కమిటీ చైర్మన్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ పిలుపునిచ్చారు. గురువారం నాడు కరీమాబాద్ ఎస్.ఆర్.ఆర్ తోటలో ఆత్మహత్యల నివారణ కమిటీ ఆధ్వర్యంలో ఆత్మహత్యల నివారణ దినం సెప్టెంబరు 10ను పురస్కరించుకొని భారతి చారిటబుల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ ఆడెపు రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ అశోక్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ గత 20 సంవత్సరాలుగా తెలంగాణ రాష్ట్రంలో ఆత్మహత్యల నివారణపై నిరంతరం కృషి చేస్తూ ఇప్పటివరకు 28 మంది జీవితాలను కాపాడడం అభినందనీయమని, ఇటీవల పోలీస్ శాఖలో జరుగుతున్న ఆత్మహత్యల పరంపరను దృష్టిలో పెట్టుకొని తెలంగాణ రాష్ట్ర పోలీసు డిజిపి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లాలో పోలీసు వారికి ప్రత్యేకంగా అవగాహన సదస్సులు నిర్వహించడం మంచి కార్యక్రమనీ, ఆత్మహత్య ప్రయత్నం చేసుకునే వ్యక్తుల పట్ల, సమాజం స్వాంతన చేకూర్చి మానసిక ధైర్యాన్ని నింపాలని, తనకి ఎవరూ లేరనే, అగాధాన్ని పూడ్చే ప్రయత్నంతో భరోసా నింపాలని, కష్టాల్లో ఉన్న వ్యక్తికి తనకు ఉన్న అన్ని దారులు మూసుకుపోయినప్పుడే ఆత్మహత్య ప్రయత్నం అనే దారి తెరుచుకుంటుందని, ఆ ప్రమాదకర క్షణంలో మేమున్నామంటూ భరోసానిస్తే బయటపడతారనీ తెలిపారు. భారతి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు సీనియర్ వైద్యులు డాక్టర్ ఆడెపు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఆత్మహత్య నివారణ కార్యక్రమాలు గ్రామస్థాయి వరకు తీసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆత్మ హత్యల నివారణ కమిటీ సభ్యులు విశ్రాంత కార్యనిర్వాహక వివాహక ఇంజనీర్ ఏ.సుధాకర్, ఆరోగ్య మిత్ర ప్రతినిధులు మల్లి పెద్ది కృష్ణశాస్త్రి,సుందర్ నాయక్ ,వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# అసెంబ్లీని తప్పుదోవ పట్టించిన సీఎం రేవంత్ రెడ్డి

- రూల్ 168 కింద సభా హక్కుల ఉల్లంఘన నోటీసు



**అక్షరశక్తి, హైదరాబాద్ :** సెప్టెంబర్ 9, 2026న తెలంగాణ శాసనసభలో జరిగిన చర్చ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి నకిలీ ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలోని పోస్టును ఆధారంగా చేసుకుని తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత కె. చంద్రశేఖర్ రావు గారి ప్రతిష్టకు భంగం కలిగించేలా నిరాధార ఆరోపణలు చేశారని, పవిత్రమైన శాసనసభను తప్పుదోవ పట్టించారని ఆరోపిస్తూ శాసనసభ నియమావళిలోని రూల్ 168 కింద సభా హక్కుల ఉల్లంఘన నోటీసు అందజేశారు. ఈ మేరకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి, పటాన్‌చెరు ఎమ్మెల్యే కలిసి అసెంబ్లీ సెక్రటరీ రెండ్ల తిరుపతికి సభా హక్కుల ఉల్లంఘన నోటీసును అందజేశారు. చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'బీఆర్ఎస్ అంతర్జాతీయ కార్యదర్శి సంధ్యారావు' పేరిట ఉన్నట్లు పేర్కొన్న నకిలీ ఎక్స్ ఖాతాలోని పోస్టును శాసనసభలో చదివి వినిపించారని వారు తెలిపారు. బీఆర్ఎస్‌లో లేని 'అంతర్జాతీయ కార్యదర్శి' పదవిని సృష్టించి, ఆ పేరుతో రూపొందించిన నకిలీ సోషల్ మీడియా ఖాతాలోని సమాచారాన్ని ఆధారంగా చేసుకుని ముఖ్యమంత్రి స్వయంగా శాసనసభలో ప్రస్తావించడం తీవ్రంగా పరిగణించాల్సిన అంశమని పేర్కొన్నారు. పవిత్రమైన చట్టసభలో అవాస్తవ, నిరాధార, వాస్తవ విరుద్ధమైన సమాచారాన్ని ప్రదర్శించడం ద్వారా సభా గౌరవానికి భంగం కలిగించడంతో పాటు, సభ్యులను తప్పుదోవ పట్టించే పరిస్థితి ఏర్పడిందని వారు ఆరోపించారు. అందువల్ల నకిలీ ఎక్స్ ఖాతాలోని సమాచారాన్ని ఆధారంగా చేసుకుని శాసనసభలో వాస్తవ విరుద్ధమైన ప్రకటనలు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై రూల్ 168 కింద సభా హక్కుల ఉల్లంఘన నోటీసును అందజేశామని తెలిపారు. ఈ అంశాన్ని తక్షణమే పరిశీలించి, నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని అసెంబ్లీ సెక్రటరీని వారు కోరారు.

# ప్రజల్లోకి వెళ్లండి!



- బీఆర్ఎస్ కుట్రను తిప్పికొట్టండి..
- ఎమ్మెల్యేల పనితీరే రాజకీయ భవిష్యత్తుకు కొలమానం
- అసెంబ్లీకి పూర్తి స్థాయిలో హాజరు కావాలి
- ప్రజా సమస్యలను సభలో బలంగా వినిపించాలి
- కులగణనపై తెలంగాణ మోడల్‌ను దేశవ్యాప్తంగా చాటాలి
- ఓటు హక్కు పరిరక్షణపై అప్రమత్తంగా ఉండాలి
- సీఎల్పీ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి



**అక్షరశక్తి, హైదరాబాద్ :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన అసెంబ్లీ కమిటీ హాల్లో జరిగిన కాంగ్రెస్ శాసనసభా పక్ష సమావేశం ముగిసింది. ఈ సమావేశంలో అసెంబ్లీలో అనుసరించాల్సిన వ్యూహం, ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టడం వంటి అంశాలపై చర్చించారు. అలాగే ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే కార్యాచరణపైనా చర్చలు జరిగాయి.

ఈ సందర్భంగా శాసనసభను సజావుగా సాగనివ్వకుండా ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ కుట్ర చేసిందని సీఎం రేవంత్ ఆరోపించారు. ఫామ్‌హౌస్‌లో కేసీఆర్ అధ్యక్షతన అసెంబ్లీ కార్యకలాపాలను అడ్డుకునే వ్యూహం రూపొందించారని విమర్శించారు. అధికారం కోల్పోయినా వారు అహంకారం వీడలేదని మండిపడ్డారు. పోలీసు సిబ్బందిలో కేటీఆర్‌కు తాను కనిపించినట్టు ఉన్నానని, అంత ఆక్రోశంతో వారిపై ఆయన దాడులు చేశారని పేర్కొన్నారు. పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులపై అనుచితంగా వ్యవహరించారని, మహిళా అధికారుల ఎదుట చొక్కాలు విప్పి ఇబ్బంది కలిగించారని మండిపడ్డారు. శాసనసభాపతినీ అత్యంత అభ్యంతరకరంగా దూషించారని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ నుంచి రాజకీయంగా ఎదిగి ఆ పార్టీకి నష్టం చేకూర్చేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని సీఎం విమర్శించారు. కాంగ్రెస్ అవకాశం ఇవ్వకపోతే సునీతా లక్ష్మారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి రాష్ట్రస్థాయి నాయకులుగా ఎదిగేవారా? అని ప్రశ్నించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ కుట్రలను బలంగా తిప్పికొట్టి ప్రభుత్వానికి అండగా నిలిచారంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలను రేవంత్ రెడ్డి అభినందించారు. ఎమ్మెల్యేల వ్యక్తిగత పనితీరు వారి రాజకీయ భవిష్యత్తును ప్రభావితం చేస్తుందని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. 'మీ ప్రవర్తన రెండోసారి గెలుపుపై ప్రభావం చూపుతుంది. మీ వ్యక్తిగత పనితీరే గెలుపు, ఓటములను నిర్ణయిస్తుంది' అని హితవు పలికారు. ఈ సందర్భంగా శాసనసభలో చురుగ్గా పాల్గొని ప్రజా సమస్యలను ప్రస్తావించాలని సూచించారు. అసెంబ్లీ జరిగే అన్ని రోజుల్లో సభ్యుల హాజరు సంపూర్ణంగా ఉండాలని, నియోజకవర్గాలకు సంబంధించిన సమస్యలను సభలో ప్రస్తావించాలని ఆదేశించారు. ప్రజలు అప్పగించిన పదవిని సక్రమంగా వినియోగించుకోకపోతే రాజకీయ భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం పడుతుందని హెచ్చరించారు.

దేశానికి తెలంగాణ చేపట్టిన కులగణన ఒక రోల్ మోడల్‌గా నిలిచిందని ముఖ్యమంత్రి అన్నారు. తెలంగాణ నమూనాలో దేశవ్యాప్తంగా జనగణనలో కులగణన చేపట్టేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని ఎమ్మెల్యేలకు సూచించారు. ఎస్ఐఆర్ పేరుతో ఓట్లు తొలగించే కుట్ర జరుగుతోందని ఆయన ఆరోపించారు. ఎమ్మెల్యేగా మరోసారి గెలవాలని భావించే ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పరిరక్షణ అంశాన్ని సీరియస్‌గా తీసుకోవాలని సూచించారు. దేశంలో వయోజనుల జనాభా 103 కోట్లుగా ఉంటే ఓటర్ల జాబితాలో 88 కోట్ల మంది మాత్రమే ఉన్నారని ఆరోపించారు. ఈ లెక్కలతో భారీగా ఓట్లు గల్లంతయ్యాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, దీనిపై అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా తీసుకున్న నిర్ణయాలు, అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు సభ నిర్వహిస్తున్నామని సీఎం రేవంత్ తెలిపారు. వెయ్యి రోజుల పాలనలో పార్టీ ఎమ్మెల్యేలు అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణలో చేపట్టిన కార్యక్రమాలను దేశంలో ఎక్కడా లేని విధంగా ముందుకు తీసుకెళ్లామని, వాటి ఫలితాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ఎమ్మెల్యేలకు సూచించారు. ఇదిలా ఉండగా.. సభ్యులందరికీ వెసులుబాటు కల్పించేలా అత్యంత చారిత్రక భవనంలో శాసనమండలి నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. అసెంబ్లీలో సెంట్రల్ హాల్‌ను ప్రారంభించి దుద్దిళ్ల శ్రీపాదరావు పేరు పెట్టుకున్న విషయాన్నీ సమావేశంలో రేవంత్ రెడ్డి ప్రస్తావించారు.

# పర్యాటక రంగం తో ఆర్థిక అభివృద్ధి




**అక్షరశక్తి,హనుమకొండ:** పర్యాటక రంగం ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రంగాల్లో ఒకటని, దీనివల్ల సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, సాంకేతిక రంగాల్లో గణనీయమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయని కాకతీయ విశ్వవిద్యాలయం చరిత్ర, టూరిజం మేనేజ్‌మెంట్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సిహెచ్. రాజ్‌కుమార్ పేర్కొన్నారు.

ప్రభుత్వ పింగిలి మహిళా కళాశాలలో చరిత్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సర్టిఫికెట్ కోర్సులో భాగంగా గురువారం "పర్యాటక రంగం ప్రాముఖ్యత" అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్‌గా హాజరైన డాక్టర్ సిహెచ్. రాజ్‌కుమార్ పర్యాటక రంగం ప్రాముఖ్యత, దాని రకాలు, అభివృద్ధి, ఉపాధి అవకాశాలపై విస్తృతంగా ఉపన్యాసం ఇచ్చారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యాటకం అంటే కేవలం ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి ప్రయాణించడం మాత్రమే కాదని, సామాజిక, మత, ఆర్థిక, సాంస్కృతిక, సాంకేతిక అంశాలతో ముడిపడి ఉన్న విస్తృత రంగమని వివరించారు. బిజినెస్ టూరిజం ద్వారా వ్యాపార అవసరాల కోసం ఒక దేశం నుంచి మరో దేశానికి ప్రయాణాలు జరుగుతాయని తెలిపారు.

ప్రాచీన కాలం నుంచే పర్యాటకానికి ప్రాధాన్యత ఉందని, చైనీయులు, సుమేరియన్లు, రోమన్లు తదితరుల ప్రయాణాల గురించి చారిత్రక ఆధారాలు ఉన్నాయని పేర్కొన్నారు. అప్పటి ప్రయాణాల వివరాలు, ప్రయాణ కథనాలు పర్యాటక రంగం ప్రాముఖ్యతను తెలియజేస్తున్నాయని అన్నారు.

అలాగే జాతరలు, పండుగలు, నృత్యాలు, సంగీతం, గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు వంటి అంశాలు పర్యాటకులను ఆకర్షించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. వీటి ద్వారా పర్యాటక పరిశ్రమ అభివృద్ధి చెందడంతో పాటు స్థానిక ప్రజలకు, యువతకు అనేక ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని వివరించారు.

కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి. చంద్రమౌళి అధ్యక్షత వహించారు. వైస్ ప్రిన్సిపాల్ సుహాసిని, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ సురేష్ బాబు, చరిత్ర విభాగాధిపతి డాక్టర్ కొలిపాక శ్రీనివాస్, చరిత్ర అధ్యాపకులు డాక్టర్ పి. నరేష్, జ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యారంగాన్ని గాలికి వదిలేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- పాలిటెక్నిక్ విద్యకు శాపంగా మారిన జీవో నెంబర్ 97 వెంటనే రద్దు చేయాలి.
- వరంగల్ పశ్చిమ మాజీ ఎమ్మెల్యే ద్యాసం భాస్కర్



**అక్షరశక్తి, హన్మకొండ :** పెండింగ్లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్లను వెంటనే విడుదల చేయాలని, అలాగే పాలిటెక్నిక్ విద్యకు శాపంగా మారిన జీవో నెంబర్ 97 వెంటనే రద్దు చేయాలని డెమొక్రటిక్ స్టూడెంట్స్ అసోసియేషన్ హన్మకొండ జిల్లా కన్వీనర్ ఉప్పుల శివ ఆధ్వర్యంలో హనుమకొండ పట్టణంలోని ఏకశిలా పార్కు వద్ద నిరాహార దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమానికి మద్దతు తెలియజేస్తూ ముఖ్యఅతిథిగా హాజరైన వరంగల్ పశ్చిమ మాజీ శాసనసభ్యులు ద్యాసం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ పేద, మధ్య తరగతి విద్యార్థులను ఉన్నత చదువులకు దూరం చేసే కుట్రలో భాగంగానే కాంగ్రెస్ ప్రభుత్వం స్కాలర్షిప్లు, ఫీజు రియంబర్స్మెంట్లు విడుదల చేయకుండా కుట్ర పన్నుతున్నదన్నారు. గత దశాబ్దాల కాలంగా ఎందరో మంది విద్యార్థులకు సాంకేతిక విద్యతోపాటు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించిన పాలిటెక్నిక్ విద్యను పెట్టుబడిదారుల చేతిలో పెట్టే కుట్రలో భాగంగా తీసుకోవచ్చిన జీవో నెంబర్ 97 ని వెంటనే వెనక్కి తీసుకోవాలని వారు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. పాలిటెక్నిక్ కళాశాలల ఆస్తులపై కన్నుపడిన సీఎం రేవంత్ రెడ్డి ఆయా భూములను పెట్టుబడిదారులకు, కార్పొరేట్లకు దరదత్తం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విద్యార్థులు బొంద పెట్టె రోజులు దగ్గర పడ్డాయన్నారు. డెమొక్రటిక్ స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ కామగోని శ్రావణ్ మాట్లాడుతూ.. జీవో నెంబర్ 97 వెంటనే వెనక్కి తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే దీక్షకు మద్దతుగా కుడా మాజీ చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్, కాకతీయ యూనివర్సిటీ పొలిటికల్ సైన్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ కృష్ణయ్య, భారత్ బచావో రాష్ట్ర నాయకులు రాంబ్రహ్మం, కాకతీయ డిగ్రీ కళాశాల ఆచార్యులు ఎడమ శ్రీనివాస్ రెడ్డి, యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల పొలిటికల్ సైన్స్ ఆచార్యులు వీరస్వామి, అలాగే ఈ యొక్క కార్యక్రమానికి భారత్ బచావో నాయకులు ఓం బ్రహ్మం, సాధనందం, రాజా మహమ్మద్, విసికే పార్టీ రాష్ట్ర అధ్యక్షులు జిలుకరా శ్రీనివాస్, ఆధార్ పార్టీ జిల్లా అధ్యక్షులు గట్టు యుగేందర్ గౌడ్, ఆర్గనైజేషన్ ఫార్ బ్యాక్వర్డ్ క్లాసెస్ నాయకులు వేణు మాధవ్, బిఆర్ఎస్ పార్టీ మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్, బీసీ సంఘం నాయకులు తడిశెట్టి క్రాంతి, విద్యార్థి సంఘాల నాయకులు పిడిఎస్యూ నర్సింహారావు, యుఎస్ఎఫ్ఐ రాజేష్, తదితరులు మాట్లాడారు.

# శాసనమండలి నుంచి బీఆర్ఎస్ సభ్యుల వాకౌట్

**అక్షరశక్తి, హైదరాబాద్ :** శాసనమండలి నుంచి బీఆర్ఎస్ సభ్యులు వాకౌట్ చేశారు. సభ జరుగుతున్న తీరుకు నిరసనగా ఈ నిర్ణయం తీసుకున్నారు. 22ఏ నిషేధిత భూములకు సంబంధించిన సమస్యలపై వెంటనే చర్చ జరపాలని బీఆర్ఎస్ సభ్యులు వాయిదా తీర్మానం ప్రతిపాదించారు. మండలి చైర్మన్ ఈ ప్రతిపాదనను తిరస్కరించారు. దీంతో బీఆర్ఎస్ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేసి బయటకు వెళ్లిపోయారు. ఈ సందర్భంగా శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసుదనాచారి మండలిలో మార్షల్స్ ప్రవర్తను తీవ్రంగా తప్పు పట్టారు. మార్షల్స్ ద్వారా సభ్యుల గౌరవానికి భంగం కలిగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శాసన మండలిలో బీఆర్ఎస్ గొంతు నొక్కేందుకు అధికార కాంగ్రెస్ పార్టీ సస్పెన్షన్స్, మైక్ ఇవ్వక పోవడం వంటి




అప్రజాస్వామిక పద్ధతులకు పాల్పడుతున్నదని ఆరోపించారు.

# క్రీడలతో క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసం

- మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా.శబరీష్
- గూడూరులో జోనల్ స్థాయి క్రీడా పోటీలు, ఎంపికలు




**అక్షరశక్తి, గూడూరు** : మహబూబాబాద్ జిల్లా, గూడూరు జెడ్పీహెచ్ఎస్ (బాలుర) పాఠశాలలో నిర్వహించిన 70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ గూడూరు జోనల్ స్థాయి క్రీడా పోటీలు, ఎంపికల కార్యక్రమానికి జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల నుంచి పోటీల్లో పాల్గొంటున్న విద్యార్థి క్రీడాకారులను ఉద్దేశించి ఎస్పీ మాట్లాడుతూ, క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, సమయపాలన, పట్టుదల, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంతో పాటు శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో దోహదపడతాయని తెలిపారు. క్రీడాకారులు తమకు ఇష్టమైన క్రీడలో నిరంతరం సాధన చేస్తూ, గెలుపు-ఓటములను సమానంగా స్వీకరించాలని సూచించారు. ఓటమిని నిరాశగా భావించకుండా ఒక సవాలుగా తీసుకుని మరింత పట్టుదలతో ముందుకు సాగాలని, క్రీడా స్ఫూర్తి, క్రమశిక్షణ, నిరంతర సాధనే విజయానికి పునాదులని పేర్కొన్నారు. విద్యార్థులు చెడు మార్గాలు, మాదకద్రవ్యాలు, ఇతర చెడు వ్యసనాలకు పూర్తిగా దూరంగా ఉండాలని ఎస్పీ సూచించారు. వ్యసనాలు యువత భవిష్యత్తును దెబ్బతీసే ప్రమాదం ఉన్నందున, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకుని విద్య, క్రీడలు, సృజనాత్మక కార్యక్రమాలపై దృష్టి సారించాలని తెలిపారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సూచనలను పాటిస్తూ నిర్దేశించుకున్న లక్ష్యాల సాధనకు కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థుల్లో అవగాహన పెంపొందించే ఉద్దేశంతో కార్యక్రమంలో సైబర్ మోసాలు, మాదకద్రవ్యాల దుర్వినియోగంపై అవగాహన పోస్టర్లను ప్రదర్శించారు. సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద లింకులు, సందేశాలు, ఆన్‌లైన్ ఆఫర్లకు స్పందించవద్దని సూచించారు. అలాగే "డ్రగ్స్‌కు దూరంగా ఉండండి - ఆరోగ్యకరమైన భవిష్యత్తును నిర్మించుకోండి" అనే సందేశాన్ని విద్యార్థులకు అందించారు. క్రీడలు, విద్యలో ప్రతిభ కనబరిచి రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించే లక్ష్యంతో కృషి చేయాలని, తద్వారా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాలతో పాటు జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఎస్పీ ఆకాంక్షించారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్



**అక్షరశక్తి, మహబూబాబాద్:** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పారదర్శకమైన, బోగస్ ఓటర్లు లేని ఓటర్ల జాబితాను రూపొందించడమే లక్ష్యంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (Special Intensive Revision SIR) కార్యక్రమం క్షేత్రస్థాయిలో వేగవంతంగా కొనసాగుతోందని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ అన్నారు. గురువారం మహబూబాబాద్ జిల్లా కురవి మండలం మొగిలిచర్ల, తార్య తండాలలో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియ నోటీసులు, వివరాల నమోదు కార్యక్రమాన్ని స్వయంగా పరిశీలించారు.

మొగిలిచర్ల పోలింగ్ బూత్ నెంబర్ 60,61, 62, లలో 310 మందికి, తార్యతండా పోలింగ్ బూతు నెంబర్ 66లో 287 మందికి నోటీసులు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ బూత్ స్థాయి అధికారులు (BLO) ఇంటింటికీ వెళ్లి సేకరించిన ఎన్యూమరేషన్ ఫారాలను పోర్టల్‌లో నమోదు (Digitalization) చేసే ప్రక్రియ పూర్తి చేసి, నమోదు చేసిన వివరాలను పాత ఓటరు డేటాతో సరిపోల్చి (CrossVerification) కచ్చితత్వాన్ని ధ్రువీకరిస్తున్నారు. కొత్త ఓటర్ల నమోదు (ఫారం6): 18 సంవత్సరాలు నిండిన అర్హులైన యువత నుంచి కొత్త ఓటు హక్కు నమోదు దరఖాస్తులను స్వీకరిస్తారని, ఓటరు వివరాల్లో తప్పుల సవరణ, నియోజకవర్గం మార్పు లేదా ఎపిక్ (EPIC) కార్డు మార్పుల కోసం ఫారం8 దరఖాస్తులను పరిశీలించారు. అనర్హులు, మరణించిన వారు లేదా శాశ్వతంగా వేరే ప్రాంతాలకు తరలివెళ్లిన వారి పేర్ల తొలగింపుపై అభ్యంతరాలను పరిశీలించడం జరుగుతుందని, ప్రజా సందేహాలు, సాంకేతిక సమస్యల పరిష్కారానికి ప్రతి మండల/మున్సిపల్ పరిధిలో ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌లను అందుబాటులో ఉండాలని రాజకీయ పార్టీలు నియమించిన బూత్ లెవల్ ఏజెంట్ల (BLA) భాగస్వామ్యంతో ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని అన్నారు. ఓటర్లు తమ దరఖాస్తుల స్థితిని మరియు వివరాలను ఆన్‌లైన్ పోర్టల్ voters.eci.gov.in లేదా Voter Helpline App ద్వారా సరిచూసుకోవచ్చని అన్నారు. SIR ప్రక్రియపై సందేహాలు లేదా ఫిర్యాదుల కోసం 1950 టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించవచ్చునని ముసాయిదా జాబితా లేదా నమోదుపై ఎలాంటి సందేహాలున్నా నిర్ణీత గడువులోగా ERO లేదా జిల్లా కలెక్టర్ (డిస్ట్రిక్ట్ మెజిస్ట్రేట్) కార్యాలయంలో అప్పీల్ చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట తహసిల్దార్ విజయ, ఎంపీడీవో వీరబాబు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

**అక్షరశక్తి, హన్మకొండ :** పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయాలని పాలిటెక్నిక్ విద్యకు శాపంగా మారిన జీవో నెంబర్ 97 రద్దు చేయాలని ఏకశిల పార్క్ వద్ద నిరాహార దీక్ష చేస్తున్న డెమొక్రటిక్ స్టూడెంట్ అసోసియేషన్ విద్యార్థి విభాగానికి స్వేరోస్ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా స్వేరోస్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి వేయి రోజులు అవుతున్నా.. స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయకపోవడం సిగ్గుచేటు అన్నారు. అదేవిధంగా పాలిటెక్నిక్ విద్యార్థులకు అన్యాయం చేస్తున్నారని అన్నారు. అదేవిధంగా ఇలాంటి నిరాహారదీక్షలకే పరిమితం కాకుండా రాబోయే రోజుల్లో ప్రభుత్వాన్ని కూడా గద్దతించే ప్రయత్నం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్వేరోస్ సీనియర్ నాయకులు ఒంటేరు చక్రి, స్వేరోస్ మాజీ జిల్లా అధ్యక్షులు శనిగరపు రాజేంద్రప్రసాద్, ఎస్ ఎస్ యు జిల్లా అధ్యక్షులు ఎల్తురి సాయికుమార్, ఎస్ ఎస్ యు కే డి సి అధ్యక్షులు చెట్టుపల్లి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## శక్తి సదన్ - స్వాధార్ గృహను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**అక్షరశక్తి, హన్మకొండ :** జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ గురువారం హన్మకొండ నగరంలోని శక్తి సదన్ ను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్శనలో భాగంగా కలెక్టర్ శక్తి సదన్ లోని వసతులను పరిశీలించి, అక్కడ ఆశ్రయం పొందుతున్న ఇన్‌మేట్స్ తో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం శక్తి సదన్ లో నిర్వహిస్తున్న అడ్మిషన్స్ రిజిస్టర్,స్టాఫ్ రిజిస్టర్, ఇన్‌మేట్స్ అటెండెన్స్ రిజిస్టర్, ఇతర రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. గృహ లో అందిస్తున్న కంప్యూటర్ శిక్షణ, టైలరింగ్ శిక్షణ వంటి వృత్తి విద్యా కోర్సుల గురించి అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా ఇన్‌మేట్స్ కు అందిస్తున్న భోజన మెనూ గురించి, తాగునీరు ఎక్కడి నుండి అందిస్తున్నారు, నాణ్యత ఎలా ఉంది అనే విషయాలపై సిబ్బందిని ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇన్‌మేట్స్ తో ఇంటరాక్ట్ అయ్యి...అందరూ తమ చదువులను పూర్తి చేసుకోవాలని, చదువు పూర్తయిన తర్వాత వారికి తగిన ఉపాధి అవకాశాలు కల్పించి, వారు స్వయం సమృద్ధి సాధించేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఎమ్. విశ్వజా, ఈ.వో. ఆశాదేవి,శక్తి సదాన్ సూపరింటెండెంట్ శైలజ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యలో వరుస విజయాలు..

**జర్నలిజంలో డబుల్ గోల్డ్ మెడల్ సాధించిన ప్రాన్షు త**



**అక్షరశక్తి, హన్మకొండ:** హనుమకొండకు చెందిన దాసి ప్రాన్షుత విద్యా రంగంలో వరుస విజయాలతో ప్రతిభ చాటారు. ఇటీవల వెలువడిన ఉస్మానియా యూనివర్సిటీ మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజంలో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ ఫలితాల్లో డబుల్ గోల్డ్ మెడల్ సాధించి హన్మకొండ జిల్లా కీర్తిని రాష్ట్రస్థాయిలో చాటారు. ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌లో జన్మించిన ఆమె ప్రాథమిక విద్యను బెంగళూరు కేంద్రీయ విద్యాలయం అభ్యసించారు. అనంతరం వరంగల్ కేంద్ర విద్యాలయంలో ఎనిమిదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదివారు. పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో టాపర్‌గా నిలిచారు. అలాగే బీఆర్ అంబేద్కర్ మరాత్వాడా యూనివర్సిటీ (BAMU)లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి యూనివర్సిటీ టాపర్‌గా నిలిచిన ప్రాన్షుత..అనంతరం ఉస్మానియా యూనివర్సిటీలో మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజంలో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. ఈ కోర్సులో డబుల్ గోల్డ్ మెడల్ సాధించి తన ప్రతిభను చాటారు. ప్రాన్షుత తండ్రి దాసి ప్రభాకర్ భారత వైమానిక దళంలో సేవలందించి, కార్గిల్ యుద్ధంలో పాల్గొన్నారు. ప్రస్తుతం హనుమకొండ యూనియన్ బ్యాంక్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్నారు. తల్లి కల్పన పర్వతగిరి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా సేవలందిస్తున్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో విద్యలో ప్రాన్షుత సాధిస్తున్న విజయాలు అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.

## హెచ్ఐవి నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించాలి

**జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రవి రాథోడ్**



**అక్షరశక్తి, మహబూబాబాద్:** ఐ.డి.ఓ.సి కార్యాలయంలో గురువారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి. రవి రాథోడ్ హెచ్ఐవి క్యూఆర్ కోడ్ పద్ధతిలో అవగాహన శిబిరాలను నిర్వహించాలని సంబంధిత వైద్యాధికారులకు, సూపర్వైజర్లకు సూచించారు. కురవి, నెల్లికుదురు, మరిపెడ, కేసముద్రం, తొర్రూర్ మండలాల్లోని వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, సూపర్‌వైజర్ల ఆధ్వర్యంలో హెచ్ఐవి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. అదేవిధంగా పాఠశాలలు మరియు కళాశాలల్లో విద్యార్థులకు క్యూఆర్ కోడ్ పద్ధతిలో, డ్రాయింగ్ మరియు పోస్టర్ పద్ధతుల్లో హెచ్ఐవి పై అవగాహన కార్యక్రమాలు, శిబిరాలు ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా సూచించారు. హెచ్ఐవి నివారణపై ప్రజల్లో, ముఖ్యంగా విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ చురుకుగా పనిచేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రవి రాథోడ్ గారు సూచించారు. ఈ సమావేశంలో మెడికల్ అధికారులు, ప్రోగ్రాం అధికారి డా.అర్జున్, జ్యోతి, డిప్యూటీ డెమో రాజ్ కుమార్, సూపర్వైజర్లు, ఎం.ఎల్.హెచ్.పి.లు, తదితరులు పాల్గొన్నారు.

## లింగ నిర్ధారణ చట్ట విరుద్ధం

**జిల్లా వైద్యాధికారి రవిరాథోడ్**

**అక్షరశక్తి, మహబూబాబాద్:** జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖధికారి డాక్టర్. రవి రాథోడ్ గురువారం మహబూబాబాద్ పట్టణంలోని ప్రైవేట్ స్కానింగ్ ఆసుపత్రులను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి రికార్డులను, గర్భిణీ పరీక్ష స్కానింగ్ మిషన్ పరిశీలించి, గర్భస్త లింగ నిర్ధారణ పరీక్షలు చట్ట రీత్యా నేరమని, గర్భస్రావం నిర్వహించే ఆసుపత్రులను తనిఖీ చేశామన్నారు. చట్టం ఉల్లంగించిన వారికి 3సంవత్సరాల జైలు శిక్ష, రూ.50వేల జరిమానా వేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రజిత, రాజ్ కుమార్, మనోహర్, అనిల్, ప్రశాంత్ పాల్గొన్నారు.



Printer, Publisher by Palle Ravi Vamshi Mohan on behalf M/s Creative Media Group by Printed at Ramani Web Offset Printers H.No. 8-82/11/1, Autonagar, Bommakal Village, Mdl&Dist: Karimnagar-505001. T.S. Published at H.No. 2-1-14, Saraswathi Nagar, Vidyaranyapuri, Mdl: Hanamkonda, Dist: Warangal-506009. T.S. Editor: Dr PR Vamshimohan.